

# సంకల్పం

## కాళీపట్నం రామారావు

చైత్రమాసం ప్రవేశించింది.

డెభ్భై ఎనిమిదేళ్ల రామభద్రయ్య పోయేడు. నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు, కోడళ్లూ, అల్లుళ్లూ, వియ్యాలవార్లూ, అతని తరుపువారూ, ఆయన భార్య తరపువారూ- ఆ పన్నెండు రోజులూ ఒకటే కోలాహలం.

ఆవేళ పన్నెండు. సమారాధనయి చేతులు కడుక్కుంటూనే ఎటువారటు చెదిరిపోయారు.

వాళ్లది పల్లెటూరు. ఆ కుటుంబానికి తగు మాత్రం పొలాలూ, ఓ పెంకుటిల్లూ ఉన్నాయి. తక్కిన పిల్లలంతా వేరేచోట్ల ఉద్యోగాలు చేసుకుంటున్నా, కొడుకుల్లో మూడోవాడు ఆ ఆస్తినీ, తల్లిదండ్రుల్నీ కనిపెట్టుకుని అక్కడే ఉండిపోయేడు. అదిగో ఆ కుటుంబం పెద్దకొడుకూ, పెద్దకోడలూ, పెద్దకూతురూ, ఆమె భర్త తప్ప తక్కిన కుటుంబాలు కూడా వెళ్లిపోయేయి.

సాయంత్రం ఐదయ్యేక ఉన్నవాళ్లు నలుగురూ వీధి వరండాలో చేరేరు. పురోహితుడు సోమన్న సుభద్రమ్మని కూడా పిలిచేడు. ఆమె వచ్చి లోపలి గుమ్మంలోనే చతికిలపడింది. బొట్టు చెరిగిన ఆమె ముఖాన్ని పరికించడం, అదే మొదటిసారి, సోమన్నకి. క్షణకాలం గుండె చెదిరినా-

"పెన్నీ ఇక్కడికీ కార్యక్రమం అంతా పూర్తయింది. ఇంక ఒక్కటే మిగిలింది- అస్థి నిమజ్జనం," అన్నాడు కర్తవ్యం ముందుంచుతూ.

ఆ నెల్లోనే అమావాస్యనాడు సూర్యగ్రహణం. అస్థికలు కలపడం ఆలోగానే జరిగిపోవాలి. ఎక్కడన్నది యింకా తేలలేదు.

బంధువులంతా దగ్గరున్న గోదావరితో సరిపెట్టేసు కోండన్నారు. ఖర్చులు కలిసొస్తాయనే కాదు- కాశీ మరీ దూరాభారం. కనీసం ఇద్దరు వెళ్లాలి. వేసవిలో రైళ్లు రద్దీ. ఉద్యోగులైన కొడుకులికి శలవు సమస్య. ఊళ్లో కొడుక్కి వ్యవసాయప్పనులు. సోమన్న తోడుకైనా, అవి పెళ్లిళ్ల రోజులు.

అయితే - రామభద్రయ్యకి ఓ కోరికుండేది. కాశీ వాసం, గంగా స్నానం. జీవితకాలంలో వెళ్లలేకపోయేడు. ఈ రూపాన్నేనా ఆయన కోరిక తీర్చాలన్నది మరో అభిప్రాయం.

అప్పుడెప్పుడో యాభయ్యో పడిలో, భర్త కాశీ ప్రయాణం తలపెట్టడం దగ్గర్నుంచి గుర్తొచ్చింది సుభద్రమ్మకి. ఎవరో కాశీ వెళ్లివచ్చేరు. మరికొన్నాళ్లికింకెవరో వెళ్తున్నారు. సతీసమేతంగా రామభద్రయ్య కూడా వెళ్లాలనుకున్నాడు. మర్నాడు ప్రయాణమనగా ముసలమ్మకి పక్షవాతమొచ్చింది. కాలూ చెయ్యీ పడిపోయేయి. రెండేళ్లు అన్నీ మంచం మీదే. ఆ విధంగా తొలిసారి ప్రయాణం తప్పిపోయింది.

ఆ తర్వాత ఆమె పోయింది. ఆవిడ అస్తికలు కలిపే నెపంతో రెండోసారి ప్రయాణమయ్యారు. అక్కడెక్కడో యుద్ధంట. ఏ క్షణాన ఎక్కడెక్కడికి ముంచుకొస్తుందో తెలీదన్నారు. దాంతో అస్థికలు గోదావర్లో కలిపీసేడు.

మూడోసారి- యాత్రా స్పెషల్లో రెండు టిక్కెట్లు తీసేడు పెద్దకొడుకు. ఊళ్లో అందరికీ చెప్పి పట్నం వచ్చేశారు. ఆఖరి క్షణంలో, యాత్రకి రైల్వే వాళ్లిచ్చిన బోగీ, ఓటిదని తెలిసింది. దాన్ని మరమ్మత్తు చెయ్యాలన్నా, కొత్తది కేటాయించాలన్నా యింకో రెండు రోజులన్నారు. ఇదిగో, అదిగో అని వారం గడిచినా యాత్ర వాయిదాల్లోనే ఉంది. విసిగిపోయిన రామభద్రయ్య-

''ఛస్- నాకీ యాత్ర ప్రాప్తంలేదు. సొమ్ము వాపసు తీసుకో,'' అంటూ కొడుకు ఎన్నివిధాల నచ్చ జెప్పబోయినా వినిపించుకోకుండా వెనక్కి వచ్చేసేడు.

ప్రాప్తం లేదంటూ వచ్చేసేడుగానీ ఆ యాత్ర ప్రాప్తం కానందుకు అతడు పడ్డ బాధ యింతా అంతా కాదు.

''ఒకసారి తప్పొచ్చు. రెండుసార్లు తప్పొచ్చు. ముమ్మారు ప్రయత్నిస్తే ముమ్మారూ తప్పాలా?'' అనే వాడు సుభద్రమ్మతో.

''ఒక పనిచెయ్యండి. నాతో పెట్టుకోకుండా మీరూ పెద్దకొడుకూ వెళ్లిరండి,'' అనేది సుభద్రమ్మ.

అతని మనసులో ఏముండేదో జవాబిచ్చేవాడు కాదు.

ఈలోగా కాలం గడుస్తూ వచ్చింది. ఓ దశకొచ్చేక, 'కాలూ చెయ్యీ వంగేయి యిప్పుడేం కాశీ,' అనేవాడు. చివరికాయన కోరిక తీరలేదు. కాశీకి బదులు కైలాసం వెళ్లిపోయేడు.

''చెప్పు పిన్నీ! ఈ పన్నెండు రోజుల కార్యక్రమం లోనూ దేనినీ నీదాకా రానివ్వలేదు నీ కొడుకులు. ఈ ఒక్క విషయం మాత్రం నువ్వే తేల్చాలట. అస్థి నిమజ్జనం కాశీలోనా? రాజమండ్రిలోనా?'' అన్నాడు సోమన్న.

అదేమిటి? తను తేల్చడమేమిటి! తనేం చెప్పా లని ఆశిస్తున్నారు పిల్లలు! వాళ్ల మధ్య అభిప్రాయభేదా లొచ్చాయా? రాకపోతే తనకు తెలిసిందేది తెలీదు వాళ్లకి? ఆయనగారిది ఆదినుండి కడదాకా కష్టజీవి బతుకే కదా!

పన్నెండేళ్ల వయసులో తండ్రి పోయాడు. తల్లీ, తనే మిగిలేరు. ఆ యింటికి పెద్ద దిక్కుగా తల్లి పిన తండ్రి వచ్చేడు. నమ్మకద్రోహి. మైనరు తరపు గార్డియన్ గా వ్యవహరిస్తూ దొరికినకాడికి మనవడి భూముల మీద అప్పులు చేసేసేడు. అందులో కొన్ని వాటిని దున్నే రైతుల దగ్గర చేసేడు. మనవడికి పద్దెనిమిదేళ్లు నిండక ముందే తాతపోయేడు.

మైనారిటీ తీరగానే కోర్టులూ, లావాదేవీలూ, మరికొన్నాళ్లు భూములు స్వాధీనం చేసుకోడానికి అప్పిచ్చిన రైతులతో రగడ, రాజీలు. ఆ తరవాత స్వాధీ నమైన భూమిని తానే దున్నవలసి రావడం. వ్యవ సాయం వంటబట్టేసరికి మగపిల్లలు చదువులకీ- పెద్ద చదువులకీ, ఆడపిల్లలు పరికిణీ ఓణీలకి ఎదగసాగేరు. మగపిల్లల్ని పట్నంలో పెట్టి చదివిస్తుండగానే ఆడపిల్లల పెళ్లిళ్లు ఆరంభం. వెండీ, బంగారాల అమ్మకాలు. భూముల తాకట్లు. కలిసొచ్చేచోట అమ్మకాలు. అల్లుళ్లూ, ఆడపిల్లలూ, పండగలకీ, పురుళ్లకీ, రాకా పోకా. ఐదారేళ్లు మహా కటకటపడ్డారు.

చివరికి పెద్ద కొడుక్కి తను చదువుకున్న పట్నం లోనే ఉద్యోగమయ్యింది. దాంతో ఊపిరాడింది. క్రమం గా సంసారం నిలదొక్కుకుంది. డిగ్రీ తీసుకున్న రెండో కొడుక్కి దూరదేశంలోనైనా మంచి ఉద్యోగం దొరికింది. పరీక్ష తప్పిన మూడో కొడుకూ, తనూ ఊళ్లో భూములు నిలబెట్టుకుంటే పెద్దపిల్లలిద్దరూ మిగిలిన ఆడపిల్ల పెళ్లికీ, ఆఖరివాడి పెద్ద చదువులకీ ఆదుకున్నారు.

ఇంత జీవనపోరాటంలోనూ ఆయన బయట వారితో ఎలా మసిల్నా, పిల్లలతో ఒక్కనాడు ఘర్షణ పడటంగాని, ఏ ఒక్కరిముందు కటువుగా నోరు జారటంగాని, ఎరగడు. మరీ పట్టరాని కోపమొచ్చినా, బాధ కలిగినా తనముందు బయటపడేవాడు. అలాగే పిల్లలకీ, చిన్నప్పుడు ఏర్పడ్డ భయంకన్న, పెద్దయ్యాక ఆయనపట్ల ఏర్పరుచుకొన్న గౌరవాభిమానాలే ఎక్కువ.

అలాంటి ఆ తండ్రికి సంబంధించిన విషయం లో ఇది చెయ్యండని తను చెప్పరావాలా!

ఇలా ఆలోచించి ఆమె అంది.

''నన్నడిగితే నేనేం చెప్తాన్నాయనా! మంచీ చెడ్డా తెలిసినవాళ్లు - వాళ్లు. సాధక బాధకాలు మోయవలసిన వాళ్లు వాళ్లు. ఇంతకాలం, నాచేతేకాదు వాళ్ల తండ్రిచేత కూడా ఏదీ చెప్పించుకోకుండానే, అన్నీ చేస్తూ వచ్చేరు. ఇప్పుడూ అలానే జరిగిపోవాలి''.

సుభద్రమ్మ మాటలు విని, 'నేను చెప్పేనా?' అన్నట్టు నవ్వుతూ అందరి వంకా చూసేడు సోమన్న. అయితే వాళ్లా నవ్వుని పట్టించుకోలేదు.

''జరిగిపోతుందమ్మా! లోగడ నువ్వో మాటన్నా వుట. జ్ఞాపకముందా?'' అడిగింది పెద్ద కూతురు.

అది ఏమాటో తెలియలేదు సుభద్రమ్మకి. జ్ఞాపకం తెచ్చుకోడానికి సూచనలేదు.

మూడోసారి కాశీ ప్రయాణం తప్పేక మరి కొన్నాళ్లకి సుదర్శనానికి మరో అవకాశం చిక్కిందంట.

అతని భార్య శకుంతల తరపు చుట్టం రైల్వేలో పనిచేస్తున్నతను తనకు సన్నిహిత మిత్రుడయ్యేడు. అతను సకుటుంబంగా కాశీ వెళ్తూ తనకు కుదరదంటూ సుదర్శనం తల్లిదండ్రుల గురించి చెప్పేడు. 'వెళ్లి తీసు కురా, మా అమ్మా నాన్నల్లా చూసుకుంటాను,' అన్నాడా మిత్రుడు.

మర్నాడే సుదర్శనం తండ్రి దగ్గరికి బయల్దేరేడు. ముందుగా తల్లితో యీ విషయం ప్రస్తావిస్తే అప్పుడామె అంది -

''చూడు నాయనా! భగవంతుడు నీకైనా, నాకైనా అన్నీ యివ్వడు. ఆయనకి యివ్వడం యిష్టం లేనిదాన్ని,

మళ్లీ అడిగితే, యిప్పటికి మూడుసార్లు మా చేతులు నెట్టేసేడు. ఆ సూచన గ్రహించక, మొండిగా మరో ప్రయత్నం చేసేమనుకో, ఏమో మరే దుర్ఘటన జరుగుతుందో! అంచేత ఆ విషయం మరిచిపో. నాన్నగారితో అయితే యీ ప్రస్తావనే తేకు."

ఇదంతా జ్ఞాపకం చేసి, "నువ్వప్పుడలా అన్నావా," అంది పెద్ద కూతురు.

సుభద్రమ్మలా అన్నమాట నిజమే. అందు గురించి ఆ తర్వాత చాలా బాధపడిందీ నిజమే.

రామభద్రయ్య తన కాశీయాత్ర గురించి ఆసరికి మరిచిపోయాడనుకుంది సుభద్రమ్మ. ఇది జరిగిన కొద్ది రోజులకే కాశీ ప్రస్తావన తెచ్చి వెళ్లలేకపోయినందుకు అతను చింతిస్తుంటే ఆమె ఆశ్చర్యపడింది. 'అయ్యో దొరికిన అవకాశం పోగొట్టేనే,' అని బాధపడింది. 'మళ్లా-వెనకట్లానే మరేదో ఆటంకమొస్తే అతను మరింత కృంగిపోవచ్చు కదా!' అని తన్నుతాను సమర్థించుకుంది.

మూడోసారి కాశీయాత్ర తప్పినప్పుడు నలుగురూ నాలుగు రకాల అనుకున్నారు. కాశీయాత్ర తలపెట్టిన వారందరికీ సమకూడదట. పూర్వజన్మలో ఎంతో సుకృతం చేసుకుంటేగాని లభించదట. ఇలాంటి మాటలు మొదట్లో పట్టించుకోకపోయినా తరవాత తరవాత నిజమేనేమో అంటూ బాధపడేవాడు.

అందుకనే ఆమె అలా ఆలోచించింది. అప్పుడా మాట అన్నది నిజమే అని ఇప్పుడు ఒప్పుకుంది.

"అదిగో ఆమాట పట్టుకునే ఇప్పుడు నిన్నిలా అడగడం. నిజానికి మాకందరికీ నాన్నగారి అస్థికలు కాశీ గంగలోనే కలపాలని ఉంది. కానీ నువ్వు కాదంటావేమో అని నీ పెద్దకొడుకు అనుమానం."

కాదని తను ఎలా అంటుంది? ఇదివరకే తన పిచ్చిభయం వల్ల ఎంతో కొంత పాపం మూటకట్టుకుంది. ఇప్పుడు మరికొంతా? అందుకని 'సరే'నంది సుభద్రమ్మ.

"అయితే ఒక్క షరతు. నువ్వు కూడా అన్నయ్యతో వెళ్తేనే కాశీ ప్రయాణం. లేకపోతే లేదు."

సుభద్రమ్మ బిత్తరపోయింది.

"ఇప్పుడు నేనెందుకూ?" అంది తత్తరపాటుతో.

"ఎందుకా? ఓసారి జరిగిన పొరపాటు రెండోసారి కూడా జరక్కూడదని."

సుభద్రమ్మకి బోధపడలేదు.

"నాన్నగారు బతికుండగా కాశీ వెళ్లలేకపోయారు. చివరికి అస్థికలు వెళుతున్నాయి. తలపెట్టిన కాశీయాత్ర నీతోనన్నా జరిపించాలన్నది అన్నయ్య కోరిక. నిన్ను వెంటబెట్టుకు వెళ్లడం వాడికో బరువు కాదు. ఆడతోడు కోసం పెద్ద వదిన కూడా నీతో వస్తుంది."

'పిల్లలు తనపట్ల ఆపేక్షతోనే యీ నిర్ణయం చేసేరు. కాని ఇదేం నిర్ణయం! తల చెడి భర్త అస్థికలతో సరిగంగ స్నానాలా?'

సుభద్రమ్మకీ ప్రయాణం అసంబద్ధంగా తోచింది. ఇందు గురించిన ఊహే బాధాకరంగా ఉంది. అందుకని- "నాకిప్పుడు వెనకట్లా ఓపికలేదమ్మా! మనసూ బాగాలేదు," అంది మనవి చెపుతున్నట్టు.

"అందుకే మీరిప్పుడు వెళ్లితీరాలి. పుణ్యక్షేత్రాలకి వెళ్లొస్తే మనసు కుదుటపడుతుంది," అన్నాడు అల్లుడు.

అల్లుడు ఒక్క వాక్యంలో చెప్పిన అంశాన్నే పది వాక్యాల్లో, వంద మాటల్లో సోమన్న ఉపన్యసించాడు. అక్కడున్న కోడళ్లూ తలకోమాటా అన్నారు. కూతురైతే ఒకటే మాట- "నువ్వెళ్లకపోతే అస్థికలూ వెళ్లవు. మాకు గంగైనా గోదావరైనా ఒకటే," అంటుంది.

సుభద్రమ్మకి తప్పలేదు. కాశీ ప్రయాణానికి ఒప్పుకుంది. మనసు మాత్రం మొరాయిస్తూనే ఉంది.

*

పున్నమి వెళ్లిన విదియనాడు వాళ్ల ప్రయాణం. ఈలోగా సుదర్శనం శకుంతలా ఊరెళ్లి, సంసారాన్ని పిల్లల కప్పగించి, చేసుకోవలసిన ఏర్పాట్లు చేసుకుని తల్లి దగ్గరికొచ్చేరు.

ఓ రాత్రి, ఓ పగలూ, మరో రాత్రీ- రైళ్లలోనూ, మధ్య కలకత్తా ప్లాట్‌ఫాం మీదా గడిపి మూడోనాటి ఉదయం మొగల్ సరాయ్ చేరుకున్నారు. మరేముందీ! కాశీ వచ్చేసేమన్నారు.

సుభద్రమ్మకి కాశీ ప్రయాణం చేసినట్టు లేదు. ఏదో ఎడతెగని రైలు ప్రయాణం చేసినట్టుంది.

ఎండాకాలపు రైళ్లు. రద్దీ చెప్పనలవి కాదు. ఏవేవో స్టేషన్లు- చిన్నవీ, పెద్దవీ, మహా పెద్దవీ, రకరకాల భాషలు- ఎరిగినవీ, ఎరగనివీ నదులు, కొండలు, గుట్టలు, దట్టంగా చెట్లూ, చేమలూ, పంటపొలాలూ- ముందు చూసినలాటివీ, ఎన్నడూ చూడనివీ. అంతే! కాశీ వచ్చేసిందట.

కొడుకు కాదుగాని కోడలు ఆ ప్రయాణం పొడుగునా మహా సంబరపడి పోయింది.

మొగల్ సరాయ్ స్టేషన్లో కాశీ పురోహితుల ఏజెంట్లట, తక్కిన యాత్రికులతో పాటు సుదర్శనాన్నీ చుట్టుముట్టేరు. ఎంత విదిలించుకుందామన్నా వదలరు. రైలు కదుల్తూ వుంటే ఇంకో ఏజంట్ వచ్చేడు. అతడి కోసమే సుదర్శనం ఎదురు చూస్తున్నాడట. ఆ అబ్బాయే చల్లా శాస్త్రుల్ల ఏజెంటట.

ఈ మధ్యనే కాశీ వెళ్లొచ్చిన ఆఫీసు స్నేహితు డొకడు యీ చల్లా శాస్త్రుల్ల చిరునామాకి కార్డు రాయిం చేడు. అక్కడ తప్ప మరెక్కడా దిగొద్దని మరీ మరీ చెప్పేడు. 'ఆయనా డబ్బులు తీసుకుంటాడు. కాని పార మార్థిక చింతచావనివాడు' అన్నాడట ఆ స్నేహితుడు.

ఆ శాస్త్రిగారి శిష్యుడు కలిసేక సుదర్శనానికి దిగుళ్లన్నీ తీరిపోయేయి. వారణాసిలో వాళ్లదికాక మరో రెండు కుటుంబాలు దిగేయి. సామాన్లేవీ మరిచిపో కుండా దింపించడం దగ్గర్నుండీ టాంగాలు మాట్లాడి ఆశ్రమానికి చేర్చేదాకా అన్ని జాగ్రత్తలూ ఆ అబ్బాయే తీసుకున్నాడు.

టాంగామీద కాశీ వీధుల్లోంచీ వెళ్తూ వుంటే వేరే ఏదోగా లేదు. దాదాపు సుదర్శనం ఉండే పట్నంలాగా ఉంది కాశీ కూడా. కాకపోతే కొందరి ఆడవాళ్ల దుస్తులూ, మగవాళ్ల దుస్తులూ వేరుగా వున్నాయి. కొందరు మరీ తెల్లగానూ, మరికొందరు మరీ నల్లగానూ ఉన్నారు. మనుషులందరూ మాత్రం పుష్టిగా ఉన్నారు. మాట మాత్రం వేరు.

అలానే-

ఆశ్రమం అంటే ఏమో అనుకున్నారు వాళ్లు. గంగ ఒడ్డున ఉండే చిన్న చిన్న గల్లీల్లో ఓ గల్లీ. అందులో ఓ పాతకాలపు నాలుగిళ్ల మండువా. కూలిపోకుండా ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయిస్తూ నిలుపు కొస్తున్నారు. అలనాడేనాడో గదులూ, వంటిళ్లూగా కట్టినట్టుంది.

ఇచ్చిన గది తుడిచి తెచ్చుకున్న పెట్టే బేడా సర్దుతూ ఉంటే చల్లా శాస్త్రిగారు వచ్చేరు.

ఆయనది డెబ్భైయ్యేళ్ల వయసు. పచ్చగా జాం పండు రంగు. నుదుట గంగ మట్టి బొట్టుతో పురోహిత వేషం.

వస్తూనే ఆయన సుభద్రమ్మని పలకరించేడు.

"అమ్మా! ప్రయాణం సుఖంగా జరిగిందా? ఎన్నా ళ్లయిందమ్మా ఆయన పోయి? వీరు పెద్దబ్బాయా? ఆమె? తమకు సంతానమెందరూ...?" అంటూ ఆ కుటుంబం గురించి తెలుసుకోదగ్గదంతా తెలుసు కున్నాడు.

ఆ తర్వాత కాశీ క్షేత్రం గురించి చేయదలచిన హెచ్చరికలు చేసేడు.

"కాశీ మహా పుణ్యక్షేత్రమని ఎక్కడెక్కడి జనమో వస్తారిక్కడికి. అయితే యిక్కడ జరుగుతున్నన్ని మహా పాతకాలు దేశంలో యింకెక్కడా జరగవు..." అంటూ దొంగలూ, హంతకులూ, గూండాలూ, పండాలూ చేతుల్లో యీనాటి యాత్రికులు పడుతున్న అగచాట్ల గురించి హెచ్చరికగా చెప్పేడు. తమ ఆశ్రమానికి వచ్చిన వారు మాత్రం తానిచ్చే రక్షణలో యే యిబ్బందీ పడ కుండా చక్కగా యాత్ర చేసుకొని క్షేమంగా తిరిగి వెళ్లొచ్చన్నాడు.

ఆ తర్వాత సుదర్శనం వంక తిరిగి-

"మీరు వెళ్లి మా ఆఫీసులో మీ కార్యక్రమాలేవో ఎప్పుడెప్పుడు చేయదలుచుకున్నారో, ఊళ్లో ఏమేమి చూడదలుచుకున్నారో, తిరుగు ప్రయాణం వివరాలన్నీ గుమస్తాకి చెప్పి రాయించుకోండి. అన్నింటికీ డబ్బు తీసుకుంటాం. కానీ చేయవలసిన సదుపాయాలన్నీ చేస్తాం. మీ టిక్కెట్లు మేం కొనిపెడతాం. ప్రతిరోజూ ఉదయాన్నే మా మనిషి వచ్చి ఆరోజు కార్యక్రమ మేమిటో, ఎన్ని గంటలకు మీరు సిద్ధంగా ఉండాలో చెపుతాడు. దగ్గరుండి తీసుకువెళ్తాడు. ప్రతి మధ్యాహ్నం తక్కిన యాత్రికులతోపాటు మిమ్మల్నీ మా మనుషులు బయటకు తీసుకువెళ్తారు. గుళ్లూ, గోపురాలతోపాటు చూడదగ్గవన్నీ చూపుతారు. బజార్ల వెంబడి తిప్పుతారు. వాళ్లు నమ్మకస్తులు. ఏది కావాలన్నా వాళ్లచేత చెప్పి చేయించుకోండి. తొందరపడి మీకు మీరుగా అటూ యిటూ పోయి యిబ్బందుల పాలైతే నా జవాబుదారీ ఉండదు," అంటూ అవాళ్టికి వాళ్లని విశ్రాంతి తీసుకో మన్నాడు.

పెందరాడే భోజనం చేసి పడుకుంటే సాయం త్రందాకా ఎవరికీ తెలివిరాలేదు. సుభద్రమ్మ లేచేసరికి యాత్రికులంతా హడావుడిగా వున్నారు. ముందుగా లేచిన శకుంతలా, సుదర్శనం కూడా ఎక్కడికో వెళ్లే వాళ్లల్లా తయారవుతున్నారు.

అత్తగారు లేచి కూచోడం చూసి-

"మీరు కూడా వేగం తయారవ్వండి. ఇప్పుడు గంగకి సంధ్యాహారతులిస్తారట. అదేమిటో అంతా గొప్పగా చెప్పుకుంటున్నారు," అంది శకుంతల.

సుభద్రమ్మకి ఎక్కడికీ వెళ్లాలని లేదు.

"మీరు వెళ్లండి. నాకేమిటో ఒంట్లో అదోలా వుంది," అంది గోడకు చారబడుతూ.

జ్వరంగాని తగిలిందేమో చూడమన్నాడు సుదర్శనం. శకుంతల ఆమె ఒంటిమీద చేయేసి చూసింది.

"జ్వరం కాదు బడలికే," అంటూ మరికాస్తసేపు పడుకోమంది.

ఇంకో అరగంటకు ఆశ్రమమంతా దాదాపు ఖాళీ అయ్యింది. సుభద్రమ్మ నడుం వాల్చిందిగాని మళ్లా నిద్రపోలేదు. ఆ కొత్తచోట ఒంటరితనంలో ఏవేవో పాత జ్ఞాపకాలు. ఏనాటి జ్ఞాపకాలవి? ఎన్నాళ్ల జ్ఞాపకాలవి!

'తను ఎక్కడ పుట్టింది? ఎక్కడెక్కడ మసలింది? ఈనాటికిక్కడ ఎంత దూరం వచ్చింది? తిరిగి తను వెనక్కి వెళ్తుందా? రేపెవరు చెప్పగలరు? అర్రులు చాచినంతకాలం అందని కాశీయాత్ర వద్దు మొర్రో అన్నప్పుడు మెడకు చుట్టుకోడమేమిటి? తను ఆశించిన యాత్రే మిటి, తనకు దొరికిందేమిటి?' అంటూ ఆలోచనలో పడ్డది.

ఆమెకిప్పుడు దాదాపు డెబ్బై. ఐదేళ్ల వయసు గుర్తుంది. ఆరుగురు తోబుట్టువుల్లో ఆమె ఐదోది. ఇప్పుడంతా పోయేరు. ఆమె పుట్టింటివారు పేదలు. పేదరికం అప్పట్లో పెళ్లికి ఆటంకం కాదు. పుట్టింటితో పోలిస్తే కలిగినింట పడింది. పన్నెండో యేట పెళ్లైతే పధ్నాలుగోయేట కాపరానికొచ్చింది. ఇంట్లో అత్తగారు, తనూ, ఆయనే. చిన్నతనంలో ఆయన పగలెప్పుడూ ఇంటి పట్టున ఉండేవాడుకాడు. గుమ్మంలో అడుగు పెట్టిందగ్గర్నుంచీ ధూమ్‌ధామ్‌లే. ఆయన బాగా ఎత్తరి. ఆయన పక్క తను పిగిలిపిట్టలా ఉండేది. గట్టిగా కేక లేస్తే తనకి కాళ్లూ చేతులూ వణికేవి. తడబాట్లో గుమ్మలు తన్నుకుని పడిపోయేది. 'పిల్లనలా హడలగొడతావేమ,'ని అత్తగారు ఆయన్ని కోప్పడేది. పదిమంది పిల్లల్ని కనకపోయినా అలా కన్న ఏ తల్లీ ఆమెకు సాటి కాదు. తను కాపరాని కొచ్చిన ఏడాదికే నెల తప్పినప్పుడు ఆమె ఎంత మురిసిపోయిందో. తొలిచూలు మగబిడ్డైనందుకు ఆర్నెల్లు మంచం దిగనివ్వలేదు. అలా చనువిచ్చారని తనెన్నడూ హద్దులు మీరలేదు. ఆవిడగారి పెద్దరికంతో సంసారం దిద్దుకుంటూ భర్తతో పాటు అందరి గౌరవం పొందింది. ఆరోజుల్లో వాళ్లది కలతలెరగని సంసారం. కలిమి లేముల వల్ల సుఖ దుఃఖాలనుభవించారేమోగాని కలతలవల్ల ఎన్నడూ కష్టపడలేదు. కొత్తతరం కోడళ్లొ చ్చాక ఎంచేతో ఆ యింట్లో వెనకటి ఆనందం కరువ య్యింది. ఆమె మనసు ఆమె కోడళ్ల చుట్టూ తిరుగు తోంది. వాళ్లూ, వాళ్ల మాటలూ, వాళ్ల ప్రవర్తనా అంతా అదో రకం.

సుభద్రమ్మకి నలుగురు కోడళ్లొచ్చారన్నమాటే గాని. ఒక్క కోడలూ ఆమె తన అత్తగార్ని సుఖపెట్టినట్టు తన్ను సుఖపెట్టలేదన్నది ఆమె వ్యధ. ఆమెకు ఆమె అత్త పట్ల ఉండిన భయభక్తుల్లో వెయ్యోవంతు ఆమె కోడళ్లకు లేదన్నది ఆమె దుగ్ధ. ఆమే, ఆమె అత్తగారూ మనసిచ్చి పుచ్చుకున్నట్టు ఒక్క కోడలూ ఆమెకు సన్నిహితం కాకపోవడం ఆమె దురదృష్టమనుకుంటుంది.

ఆదిలో ఆమెకి యీ అసంతృప్తి అనేది ఉండేది కాదు. ఎప్పుడైతే రామభద్రయ్య ఓ ప్రమాదానికి గురై ఆర్నెల్లు మంచమెక్కాడో అప్పుడు పొటమరించింది. ఆ తర్వాత ఇంటి పరిస్థితి మారిపోవడంతో వృద్ధి పొందింది. తనకూ వయసు మీదపడి జవసత్వాలు సన్నగిల్లడంతో శాఖోపశాఖలుగా విస్తరించి ఆ అసంతృప్తి ఆమె మనసల్లా చీకటి చేస్తోంది.

పదిహేనేళ్ల క్రితం ఓనాడు పొలం నుండి వస్తూవుంటే, వెనక నుండీ పరిగెత్తుకొస్తున్న ఓ ఎద్దు, రామభద్రయ్యను రెండు కొమ్ముల్తో ఎత్తి కుదేసేసింది. చచ్చే పోయాడనుకున్నారు. తుంటె ఎముక విరిగింది. సుదర్శనం వచ్చి తండ్రినీ, తల్లినీ పట్నం తీసుకుపోయేడు. తిరిగి వచ్చేసరికి ఆర్నెల్లు పట్టింది. మూడు నెల్లు పెద్దాసుపత్రిలో మంచంమీద. మరో మూడు నెల్లు ఆసుపత్రికి వెళ్లీ వస్తూ పెద్దకొడుకు ఇంట్లో మంచం మీద, ఊరికి తిరిగొచ్చాక కూడా కొన్నాళ్లు మంచం మీదే.

దాంతో సహజంగానే ఆ యింటి పరిస్థితి మారిపోయింది. అప్పట్లో ఆయన చేయిజారిన బయట పెత్తనం మళ్లా ఆయన చేతికి రాలేదు. అప్పటికి, ఎదిగి వచ్చిన అక్కడి కొడుకు, వ్యవసాయపు పనుల నుండి ఇచ్చిపుచ్చుకొనే లావాదేవీలుదాకా, అన్నీ తానే చూస్తున్నాడు. బురదా బాడీలో నడక ప్రమాదమని పొలంకి రానిచ్చేవాడు కాడు. రామభద్రయ్య మొరాయించబోతే సుభద్రమ్మా అడ్డుకునేది. ఆ తరవాత అలవాటు తప్పడం వల్లో, అలక పెట్టుకోవడం వల్లో అతడు వెళ్లేవాడుకాడు. అప్పట్లో కొడుకు తండ్రికి చెప్పేకే ఏ పనన్నా చేసేవాడు. కొన్నాళ్లు పోయేక ఏ వ్యవహారం గురించైనా అడిగినప్పుడు జవాబిచ్చేవాడు. మరికొన్నాళ్లు పోయేక దేనిగురించన్నా ఒకటికి రెండుసార్లు అడిగితేగాని జవాబొచ్చేది కాదు. ఆ తర్వాత్తర్వాత అలా అడిగినప్పుడు ఎదటో, వెనకో విసుక్కునేవాడు. మరి రామభద్రయ్య ఏమనుకున్నాడో ఆ తర్వాత రోజుల్లో దేని గురించీ అడిగే వాడు కాడు.

ఇదంతా సుభద్రమ్మ గమనిస్తూనే ఉండేది. లోపల ఎంతగా ఉడికిపోతూ వున్నా ఎవ్వరి ముందూ బయటపడేది కాదు.

ఈ మార్పులన్నీ పది పన్నెండేళ్లల్లో వచ్చిన మార్పులు. ఆరోజుల్లో- మొగుడు కొడితే మాధవకవళం వాడూ కొట్టేడన్నట్టు పాలేరూ, పనిమనిషీ, వ్యవహారం మీద యింటికొచ్చే పరాయివాళ్లూ కూడా, కొడుకాయనకెంత గౌరవం యిస్తే అంతే గౌరవం ఇస్తుండేవారు. దీన్ని మాత్రం ఆమె సహించలేకపోయేది. పరాయివాళ్లను కాకపోయినా పనిమనిషినీ, పాలేర్నీ కూకలేసేది. వాళ్లు కూడా ఆమె చుట్టుపట్ల ఉంటే ఓలాగా, ఉండక పోతే ఇంకోలాగా మసిలేవారు.

ఈలోగా తక్కిన పిల్లలు, ఎప్పట్లానే, వస్తూ పోతుండేవారు. తల్లీతండ్రీ కూడా, అవసరం పడినప్పుడు వాళ్ల ఇళ్లకి వెళ్లివచ్చేవారు. ఇంటి పరిస్థితీ, తండ్రి పరిస్థితీ వాళ్లు చూడలేనివి కావు. 'ఏమిటీ పద్ధతి?' అని ఏ ఒక్కరూ అడగలేదు. తల్లీ తండ్రీ ఏం కష్టపెట్టుకుంటు న్నారో- అన్న చింతైనా వాళ్లలో కనిపించలేదు.

రామభద్రయ్య అభిమాని. ఆయన భార్య దగ్గ రైనా బయటపడేవాడు కాడు. సుభద్రమ్మ అంతకన్నా అభిమాని. కూతుళ్ల దగ్గరైనా బయటపడేది కాదు. కాని మించి వచ్చిందంటే రామభద్రయ్య కోసం అంతటి అభిమానాన్నీ పక్కన పెట్టేది.

చిన్నప్పణ్ణుంచీ రామభద్రయ్యకు ఆ యింట రాజభోగంగా జరుగుతుండేది. ఒక్క కొడుకు. ఉన్నంత లోనే ఆయన భోజన సదుపాయం ప్రత్యేకం. పడక సదుపాయాలు ప్రత్యేకం. పనిపడి పిలిస్తే సుభద్రమ్మా పిల్లలే ఏమిటి, అతని తల్లే అగ్గగ్గలాడుతూ వెళ్లేది. అలాంటి ఆ మనిషికి అతని యింట్లోనే ఒకటికి రెండు సార్లు పిలిస్తేగాని మనవలు కూడా వినిపించుకోరు. దానితోపాటే తక్కినవీ. సుభద్రమ్మకు బాధేసేది. తనకు ఒంట్లో బాగున్నా బాగులేకపోయినా తానే వంటకు తయారయ్యేది. కొడుక్కి తన వంటలు రుచించకపోతే కొంత వంట తానుచేసి కొంత వంట కోడలి చేత చేయిం చేది. ఎక్కణ్ణుండైనా రామభద్రయ్య కేక వినిపిస్తే, వెంటనే, 'మామగారు పిలుస్తున్నారు చూడు,' అంటూ కోడల్ని తొందరపెట్టేది. మనవలో, మనవరాళ్లో ఊర్నుం డొచ్చినా, ఊరికెళ్తున్నా- 'తాతగారికి కనపడ్డావా? తాతగారితో చెప్పేవా?' అనేది.

ఆయన్ని ఆదినుండీ ఎరుగున్నవాళ్లూ, ఆయన పట్ల గౌరవానికి అలవాటుపడ్డ వాళ్లూ తప్పిస్తే తక్కిన వాళ్లు ఆమె మాటల్ని పట్టించుకునేవారు కారు. అయినా సుభద్రమ్మ ప్రయత్నలోపముండేది కాదు.

చివరికి-

ఏడాది క్రితం, తడి గచ్చుమీద కాల్జారగా రామ భద్రయ్య మరోసారి దబ్బునపడ్డాడు. లోగడ అతుక్కున్న ఎముకే నుగ్గునుగ్గయ్యిందట. ఆ వయసులో యింక చేయగలిగిందేమీ లేదనీసేరు పెద్దాసుపత్రిలో.

రామభద్రయ్య పట్టు బలవంతంవల్లా, పల్లె టూర్లో ఇతర సదుపాయాల దృష్ట్యా, సొంతింటికే తెచ్చి దించీసేరు. గచ్చాకు, పుచ్చాకు కట్లతో, మంచం పట్టాక పుట్టిన కొత్త రుగ్మతల్తో నిండా యేడాది తీసుకున్నాడు.

ఈ ఏడాదీ సుభద్రమ్మ అనుభవించిన దుఃఖం ఇంతా అంతా కాదు.

తన భర్తకు నలుగురు కొడుకులు, నలుగురు కోడళ్లు. అల్లుళ్లు మన్నన వాళ్లైనా చేయదగ్గవాళ్లు. ముగ్గురు కూతుళ్లున్నారు. ఆపైన తనుంది. తన అత్త గారి కొక్కడే కొడుకు. తనొక్కతే కోడలు. అయినా ఆవిడకి జరిగినపాటి యీయనకు జరగడం లేదన్నది ఆమె చింత.

పిల్లలకు ప్రేమ లేదనదు. కాస్త బాగులేదనేసరికి ఎంతెంత దూరాల నుండో వచ్చిపోతున్నారు. డబ్బుకి లోభించారనదు. ఎంతంటే అంత. దేనికంటే దానికి ఖర్చు పెడుతున్నారు. కొడుకులూ, కోడళ్లూ చెయ్యలే దనదు. తను చేయదగ్గ సేవలు తను చేస్తుంటే, వాళ్లు చేయదగ్గవి వాళ్లు చేస్తున్నారు- వాళ్ల పిల్లల్తో సహా. అయితే యింత చేసినా, ఇదంతా ఓ కన్నతండ్రికి చేసి నట్టు కాకుండా, కాలం చెల్లిన మనిషికి, కాబోయే ఓ కట్టెకి చేస్తున్నట్టు ఆమె కంటికి కనిపించేది. అలా కని పించినప్పుడల్లా ఆమె అభిమానంతో ఊగిపోయేది. 'ఛీ వీళ్లు చేసేదేమిటి? వీళ్లు చూసేదేమిటి? నా అత్తగారికి కడదాకా ఎలా ఆదరంతో, గౌరవంతో సేవ చేసేనో అలాగే యీయనకీ నేనే చేస్తాను,' అంటూ అయిన దానికి కానిదానికీ తానే పరిగెట్టబోయేది. అయితే అత్త గారి నాటికి ఆమె నలభయ్యో పడిలో ఉంది. ఇప్పుడూ శరీరంమీద పాతికేళ్ల బరువు పడింది. మనసు దూకి నంతగా శరీరం సహకరించేది కాదు.

దాంతో అప్పుడప్పుడూ విసుక్కునేది. విసుగుని కోపంగా మార్చుకుని పిల్లల మీద పెంచుకునేది. అందుకూ, ఇందుకూ ఏడ్చుకునేది. అలా ఏకాంతంలో ఎన్నిసార్లు కళ్లు తుడుచుకుందో! అలా కళ్లు తుడుచు కుంటూ పిల్లలమీదా జీవితంమీదా ఎంత విరక్తి పెంచు కుందో! ఆ చిత్తక్షోభంతా ఆమెకొక్కదానికే తెలుసు.

ఆ చిత్తక్షోభలోంచే ఆమె కొన్ని నిర్ణయాల కొచ్చింది. 'మనిషి కాలూ, చెయ్యీ ఒంగీదాకా బతక్కూ డదు. ఎవరు బతికినా తను బతకదు. భర్త ముప్పు గడిచి పోతే తనకింక ఏ బాధ్యతలూ ఉండవు. ఆ కాస్తా గట్టె క్కాక ఏదో ఓదారి చూడాలి. మనసు దృఢం చేసుకుంటే మార్గాలే ఉండవా? ఊరు చుట్టూ ఎన్ని నేల నూతులు లేవు? అనుకునేది. తనువు నొచ్చినా ఒంటరితనంలో ఆలోచనలతోనే ఊరట పొందేది.

అయితే, రామభద్రయ్య పోయేక, కొడుకులూ, కోడళ్లూ, వాళ్ల వాళ్ల సంతానాలూ ఇలా అందరూ వచ్చి కళ్లబడ్డాక, వాళ్ల ఆపేక్షలూ, తనపట్ల వాళ్ల పాత ఆదరణా గమనించాక వెనకటి కోపాలూ, భయాలూతోపాటు ఆ ఒంటరి రాత్రుళ్ల నిర్ణయాలని కూడా మరచిపోయింది. ఇంటి ఇంటెడు చుట్టాలూ వెళ్లిపోయిన్రోజున పిల్లలం దరూ ఒక్కటై తన కాశీ ప్రయాణం తప్పదన్న రాత్రి ఆ చిత్తక్షోభా, ఆ నిర్ణయాలూ మళ్లా జ్ఞాపకం వచ్చాయి.

కాశీ వచ్చాక, ఇప్పుడు మళ్లీ అవే ఊహలు మనసులో మెదుల్తున్నాయి.

ఇంతలో-

"అదేంటత్తయ్యా! లైటైనా వేసుకోకుండా పడుకున్నారు?" అంటూ శకుంతల గదిలో ప్రవేశించి స్విచ్చి వేసింది.

సుభద్రమ్మ గక్కురుమంది. జవాబివ్వకుండా కోడలు స్విచ్చి వేసేలోగా రెండో వేపుకి ఒత్తిగిలిపోయింది.

*

గంగనుండి వస్తున్న సుదర్శనాన్ని ఎవరో "ఏవండోయ్!" అంటూ కేకేసేరు. సుదర్శనం, శకుంతలా ఆశ్రమం మెట్లెక్కుతున్న వాళ్లే ఆగిపోయేరు.

ఆయనా తెలుగువాడేట. ఆ భార్యభర్తలు తెలుగులో మాటాడుకోడం విని కేకశాడట. వాళ్లది తుని దగ్గర ఏదో ఊరు. ఆంధ్రాశ్రమంలో దిగేడు.

వచ్చిన పనీ, దిగిన బసా, అక్కడి సదుపాయాలూ గురించి ప్రశ్నలు వేస్తూ మధ్య మధ్య తన గురించి చెపుతూ, సంభాషణ ఎప్పటికీ తెమల్చడు.

చూసి చూసి, "మీరు మాటాడుతుండండి. అత్తయ్య ఒక్కరే ఉన్నారు," అంటూ శకుంతల లోపలికొచ్చేసింది. దీపం వేసినా అత్తగారు లేవకపోవడంతో కాళ్లూ చేతులూ కడుక్కోవడానికి వెనక గదిలోకెళ్లింది.

ఆవె తిరిగొచ్చేసరికి సుదర్శనం బట్టలు మారుస్తూ గంగ ఒడ్డున తాము చూసిన విశేషాలు తల్లికి చెపుతున్నాడు. సుభద్రమ్మ గోడకు చేరబడి కూర్చుంది.

తను చెపుతున్నది తల్లి వినిపించుకోవడం లేదని గ్రహించాక-

"ఇంకా ఒంట్లో అలాగే ఉందా?" అన్నాడు సుదర్శనం.

"మరేం లేదు. బడలికే," అంది సుభద్రమ్మ.

సుభద్రమ్మ అలా జవాబిస్తుంటే వెనక నుంచొచ్చిన శకుంతల ఆవిడకు కనిపించకుండా ఏవో సైగలు చేసింది. వెంటనే మాట మార్చేసేడు సుదర్శనం.

"భోజనాలకెళ్దామా?" అన్నాడు తల్లితోనో, భార్యతోనో తెలీకుండా.

"వెళ్దాం. కాస్తసేపు డాబామీద కూర్చుని," అంది శకుంతల.

యాత్రికులందరూ డాబామీదికి ఎక్కీ దిగుతున్నారు. వాళ్లింకా డాబామీదికెళ్లలేదు.

"అలాక్కాదు. బయట పని పెందలాడే ముగించుకొచ్చేస్తే, ఆ తర్వాత ఎంతసేపన్నా కూచోవచ్చు. మీ ఇష్టం," అంది సుభద్రమ్మ.

బరువుగా వున్న ఆమె గొంతు విని కొడుకూ, కోడలూ ఎదురు చెప్పలేదు.

సుభద్రమ్మకి పాలూ, పళ్లూ తేవడానికీ, తామిద్దరూ భోజనాలు చేసి రావడానికీ, బయల్దేరేరు భార్యాభర్తలు. మర్నాడు పితృకార్యం ఉంది కాబట్టి వాళ్లను కూడా ఫలహారాలతోనే సరిపెట్టుకోమంది సుభద్రమ్మ.

సందు మలుపు తిరగ్గానే ఆరంభించింది శకుంతల.

"అత్తయ్యేంటీ అదోలా ఉన్నారు? బయల్దేరిందగ్గర్నుండీ ఆవిడ అలాగే ఉన్నారు. మిమ్మల్ని మెట్ల దగ్గర వదిలేసి లోపలికొచ్చానా, చీకట్లోనే పడుకుని ఉన్నారు. అప్పటిదాకా ఏడుస్తున్నారని నా అనుమానం," అంది శకుంతల.

సుదర్శనం జవాబివ్వలేదు. వింటున్నాడు.

"ఆవేళ మాంగారు పోయారా? అందరాడవాళ్లలా ఆవిడ గుండె కొట్టుకుని ఏడవలేదు. అది చూసి, 'అన్నిటికీ సిద్ధపడిపోయేరు కాబోలు. వచ్చిన కష్టాన్ని సుళువుగానే తట్టుకుంటారు,' అనుకున్నాను. ఇప్పుడు చూస్తే అలా అనిపించడంలేదు. లోపల కుమిలిపోతున్నారు. అదంత మంచిది కాదు". అంది శకుంతల.

తను మాటాడ్డమేగాని సుదర్శనం మాట కలపకపోయేసరికి ఆమె మాటలాపేసింది.

ఫలహారాలు పూర్తికానిచ్చి తిరిగి వస్తూ దార్లో సుదర్శనం అడిగేడు.

"శకుంతలా! ఇక ముందు అమ్మ మనతోనే ఉంటుందనుకో. ఏమేనా ఇబ్బందులుంటాయా?"

అనుకోని ప్రశ్న! ఆలోచించవలసిన ప్రశ్న! ఆశ్చర్యపోతూ జవాబిచ్చింది.

"ఇబ్బందులేముంటాయ్? మనకేం ఉండవు. ఉంటే ఆవిడకే ఉండాలి."

"అంటే?"

"జీవితం నింపాదిగా సాగుతుంది పల్లెటూళ్లో. అక్కణ్ణుండి వచ్చినవాళ్లు మన ఉరుకుల పరుగుల జీవితంలో యిమడ్డం కష్టం అంటారు మీరే".

సుదర్శనం ఆ మాటన్నది రామభద్రయ్య గురించి. తండ్రి ఎప్పుడు వాళ్లింటికొచ్చినా ఒకటి రెండు రోజులు గడపగానే తిరుగు ప్రయాణానికి తొందరపడేవాడు. తల్లి అంతలా తొందరపడేది కాదు. ఆమైనా తండ్రికి ఒంట్లో బాగులేనప్పుడు ఆ ఆర్నెల్లలో ఏదో నెపం పెట్టి రెండుసార్లు యింటికెళ్లొచ్చింది. అయితే యిప్పటి పరిస్థితి వేరు.

"ఆమె ఉండగలిగితే మనకు ఇబ్బందిలేదు కదా?"

‘‘అదేం మాటండీ? ఇబ్బందైతే మాత్రం? సర్దుకుంటాం.’’

అది చాలనుకున్నాడు సుదర్శనం.

సుభద్రమ్మ ఫలహారం కూడా ముగిసేక ముగ్గురూ డాబా మీద కెళ్లేసరికే డాబా అంతా పక్కలతో నిండిపోతోంది. ఓ చివర కాస్త ఖాళీ కనిపించింది. శకుంతల తనతో తెచ్చి జంపఖానా పరుస్తూ ఉంటే గంగ ఏ దిక్కునుందో తెలుసుకుంటోంది సుభద్రమ్మ.

ముగ్గురూ కూర్చున్నాక కాస్తసేపు యీ కబురూ ఆ కబురూ కానిచ్చారు. సుభద్రమ్మ వెనకటంత మంద కొడిగా లేదు.

‘‘అమ్మా! ఇక్కణ్ణుంచి వెళ్లేక నువ్వు మాతో వచ్చేస్తావా?’’ అన్నాడు సుదర్శనం.

తనకు పుట్టింటివారు లేరని కాదు. కాని యీ వయసులో ఆమెను తీసుకెళ్లి కాస్త గంజి పోసేవారు లేరు. అందుక్కాబోసు కొడుకలా అడుగుతున్నాడనుకుంది సుభద్రమ్మ.

‘‘నువ్వు రమ్మంటే కాదనను. కాని అనవసరం.’’

సుదర్శనం తాత్పర్యం ఆమెకి బోధపడనట్టే ఆమె తాత్పర్యం అతడికీ బోధపడలేదు.

‘‘అదికాదమ్మా! ఇంతకాలం నాన్నగారి బాధ్యత నీ మీదుంది. ఆయన యిల్లు విడిచి రానన్నారు. మరేం చెయ్యలేక ఊరుకున్నాను. ఇప్పుడు పరిస్థితి మారింది. నువ్వు నాతోనే ఉండడం ధర్మం.’’

సుభద్రమ్మకి అర్థమయ్యింది. కాని ఏం చెప్పాలో తెలియలేదు.

‘‘తమ్ముణ్ణి కూడా అడగాలి కదా,’’ అంది.

‘‘తమ్ముడు నాకన్నా చిన్నవాడు. నేను నీకన్నా చిన్నవాణ్ణి,’’ అన్నాడు సుదర్శనం. అతని గొంతు వేరుగా వుంది. అలాంటి గొంతు వింటే సుభద్రమ్మ మాటాడ లేదు.

అందుకని సుదర్శనం గొంతు మారుస్తూ అన్నాడు.

‘‘నేనింకో రెండేళ్లలో రిటైరవుతానమ్మా! అంత వరకే మనం పట్నంలో ఉంటాం. ఆ తర్వాత మనూరో, మరో ఊరో- పల్లెటూర్లోనే ఉందాం.’’

సుభద్రమ్మకి మళ్లా అర్థం కాలేదు. సందేహిస్తూ అడిగింది.

‘‘మనం అంటే?’’

‘‘నువ్వూ నేనూ. అంతవరకూ రూఢి.’’

సుభద్రమ్మ కిదేదో గందరగోళంగా ఉంది.

‘‘మీ కోడలింకా తేల్చుకోలేదు. తనక్కూడా యిష్టమైతే వస్తుంది. లేదా తన పిల్లల్తో ఉంటుంది.’’

ఏదో ఆపద ముంచుకొస్తుంటే గుండెలు పట్టుకున్నట్టు సుభద్రమ్మ గుండెలు దడ దడమన్నాయి. అప్రయత్నంగా ఆమె కోడలి వంక చూసింది.

‘‘వినండి వినండి! యింకా వినండి!’’ అంది శకుంతల.

ఆమె గొంతులో వైమనస్యం లేదు. బాగా అణచుకుంటున్న బాధుంది.

కొడుకింకేం వినిపిస్తాడో అని ఎదురుచూసింది. సుభద్రమ్మ. అతడేమీ వినిపించకపోయేసరికి కోడలే అందుకుంది.

‘‘ఓ సంవత్సరమయ్యిందత్తయ్యా! ఈయన యీ కొత్త నస పట్టుకున్నారు. పల్లెటూళ్లో ఉండలేరండీ అంటే వినరు. పట్నం బతుకు విసుగొచ్చేసిందట. నలభై యైళ్లుగా అలవాటైన పట్నం మీదే విసుగొస్తే ఎప్పుడో చిన్నప్పుడు కొన్నాళ్లున్నారు. ఆ పల్లెటూళ్లో ఇప్పుడీయన యిమడగలరా? అలవాట్లన్నీ మార్చుకుంటారట. ఏం వా ఖర్మ! అక్కడ పుట్టి పెరిగినవాళ్లకైతే రోజల్లా వ్యాపకాలుంటాయి. ఈయనకేం వ్యాపకం? రోజెలా గడుస్తుంది? ఒకటి రెండు రోజులు సరదాగా పల్లెటూర్లో గడిపిందానికీ ఏకం అక్కడే ఉండేదానికీ, తేడా ఉంటుందంటారా ఉండదంటారా? మీరే చెప్పండి’’.

ఆలుమగల గొడవల్లో కొందరత్తగార్లు కలుగజేసుకోవచ్చు. సుభద్రమ్మలాటివాళ్లు కలుగజేసుకోరు. ఆ విషయం స్ఫురించాక శకుంతలే అంది.

‘‘రెండో పిల్లకింకా పెళ్లి కాలేదు. ఆఖరివాడి డాక్టరీ పూర్తయేసరికి కనీసం ఐదేళ్లు పడుతుంది. అందాకా అయినా ఆగాలా? కాదట. వాళ్లంతా మేజర్లట. ఇష్టమైతే పెద్దకొడుకూ పెద్ద కోడల్తో ఉంటారట. లేదా హాస్టళ్లలో ఉంటారట. ఏమిటేమిటో చెప్తారు. ఆ పిల్లలూ ఆయనకే వత్తాసు. వీళ్ల పిచ్చి వీళ్లకానందం కావచ్చు. బాధ్యత పిల్లలమీద వదిలేసిపోతే, ఆ తర్వాత ఏమేనా అయితే; నలుగురూ ఏమంటారు? ఎవరినంటారు? ఉన్న పిల్లల బాధ్యతేనా తీరాలండీ అంటే దానికిలా అర్థాలు తీస్తున్నారు.’’

పెద్ద కొడుక్కీ పెద్ద కోడలికీ పెళ్లై ముప్పై యేళ్లవుతుంది. వాళ్లిద్దరి మధ్యా రెండు అభిప్రాయాలుండొచ్చనేది ఊహకి కూడా అందని విషయం. అందుకని సుభద్రమ్మ ఆశ్చర్యపోతూ వింటోంది. శకుంతల-

‘‘మీరే చెప్పండి- యిలా యీయన పట్టుబడితే, యిటు యీయన్ని వదలగలనా? అటు పిల్లల్ని వదలగలనా?’’ అంది నిష్ఠూరంగా.

‘‘తల్లులెప్పుడూ పిల్లల్తోనే ఉంటారు. అందుకే కదా మా అమ్మనడుగుతున్నానూ,’’ అన్నాడు సుదర్శనం, భార్యను కవ్విస్తూ.

"అంటే నన్ను నా పిల్లలతో ఉండమని, మీరూ, మీ అమ్మా ఉంటారా?"

"తప్పనప్పుడు- కొన్నాళ్లు, నీకు తీరికయ్యేదాకా- ఉంటాం. తప్పేముందీ?"

"అబ్బే! అది చాలా అందంగా ఉంటుంది. ఈ వయసులో ఆమె చేత వండించుకుని, నీళ్లు తోడించి, బట్టలుతికించి- చాలా దివ్యంగా ఉంటుంది. లోకం కూడా మిమ్మల్నీ, మీ అమ్మగార్నీ ఏమీ అనదు. అంటే నన్నంటుంది."

శకుంతల అన్నదాంట్లో అసత్యంలేదు. అందుకే-

"అమ్మెందుకు చేస్తుందీ? బరువు పన్లన్నీ నేనే చేస్తాను. లోకం దెబ్బలాడుతుందంటే ఎవరికంటా పడకండా చేస్తాను," అన్నాడు సుదర్శనం.

"ఆఁ.. చేస్తారు!" అని చారెడు యీసడించి అత్త గారితో అంది శకుంతల.

"ఆ కాడికీ అన్నానత్తయ్యా! 'ఓ ఏడాది మీ ఊళ్లో నే మీ తమ్ముడిగారితో ఉండండి. ఆ ఏడాదిపాటూ అక్కడ ఉండగలిగితే అప్పుడు చూద్దాం,' అన్నాను. అలాక్కాదట. ఆ యింట్లో తనకి స్వతంత్రం ఉండదట. ఎక్కచ్చి కాపరమే పెట్టాలిట.".

సుభద్రమ్మకి అనుమానం వేసింది.

"ఇదంతా నా గురించి కాదుకదా! మీరు పట్నం లోనే ఉంటే మీతోపాటు నేనూ అక్కడుండగల్ను. నాకు పట్నమైనా పల్లెటూరైనా ఒకటే," కొడుకు వంకోసారీ, కోడలి వంకోసారీ చూస్తూ అంది.

"ఇప్పుడేమంటారు?" అంది శకుంతల వెంటనే.

సుదర్శనం నిదానంగా జవాబిచ్చాడు.

"నేను పల్లెటూళ్లో ఉండాలనుకోడం నిన్నిబ్బంది పెట్టడానికో, అమ్మను సుఖపెట్టడానికో కాదు. నా కోసం," అంటూ- అలాంటి కోరికకు కారణాలు వివరించేడు.

తండ్రి మంచానపడ్డది లగాయితూ తమ కుటుంబసభ్యుల మనసుల్లోనూ, ప్రవర్తనలోనూ వాళ్లకే తెలియకుండా వస్తున్న మార్పులూ, ఆ మార్పులు కారణంగా తల్లిదండ్రుల చిత్తక్షోభా అతడు గమనిస్తూనే ఉన్నాడు. తమ కుటుంబమనే కాదు- ఎదిగిన సంతానం, వయసు మళ్లిన తల్లిదండ్రులూ కలిసున్న మరికొన్ని కుటుంబాలూ అతడెరుగును. అంతటా ఇలాంటివే మార్పులు. ఇదే స్థితి.

సర్వసాధారణమైన యీరకం పరిణామాలూ, సంక్షోభాలూ - ఇలాంటి కుటుంబాల్లోనే కాదు; ఈనాడే కాదు; భూమ్మీద జీవరాసి పుట్టింది లగాయితూ జీవులు మందలుగా, గుంపులుగా, కుటుంబాలుగా, సమాజా లుగా బతకటం ఆరంభించి, నాయకత్వం, యాజ మాన్యం, పెద్దరికం వంటివి ఏర్పరచుకున్నాక- తరం మారి కొత్తతరం తలెత్తినప్పుడల్లా వస్తూనే ఉన్నాయి. పెద్దరికం కోసం, నాయకత్వం కోసం పడుచుదనం పాత తరాన్ని సవాలు చేస్తూనే ఉంది; చేస్తూనే ఉంటుంది.

అది అడవి ఏనుగుల మంద కావచ్చు. ఆటవిక మానవుల గుంపు కావచ్చు. ఆ సవాలు ఘోరమైన పోరా టాలకూ, రక్తపాతాలకూ నాంది అవుతుంది.

ఇరుపక్షాలూ ఒకే గుంపులోని గురువూ, శిష్యుడూ లేదా అన్నా తమ్ముడూ అయినా, చిరకాలంగా ఒకే ధ్యేయం కోసం భుజం భుజం కలిపిన ఆప్తమిత్రు లైనా, వారెవరైనా, ఆ ముందు క్షణం వరకూ ఆ యిద్దరి మధ్యా ఎంతటి ప్రేమాభిమానాలుండినా ముఖాముఖీ నిలిచేక ఇద్దరిలో ఎవరిదో ఒకరిది- తల తెగి నేల దొర్ల వలసిందే. ఇరుపక్షాలకీ అండగా నిలిచిన మరెందరిదో రక్తం ప్రవహించవలసిందే.

విజ్ఞత పెరిగిన సమాజాలు ఇలా శక్తిమంతులు నష్టమైపోడం ఆపడానికి ఎన్ని నాగరిక పద్ధతులు ప్రవేశ పెట్టినా యీనాటికీ అనాగరిక పద్ధతులు కొనసాగు తున్నాయి. నాగరికత నటించేచోట్లా, అవగాహన చాలని చోట్లా రక్తప్రవాహాలకి బదులు కన్నీటి కాలవలూ ప్రాణి హింస స్థానంలో మానసిక హింసా- మొత్తానికి హింస తప్పదు.

అనాదిగా సాగుతున్న యీ తరాల ఘర్షణ గురించీ, అందులో మనిషి పడే హింస గురించీ సుదర్శనం ముందే కొంత విన్నాడు. తన చుట్టూ సాగుతున్న ఘర్షణని గుర్తించడానికీ, దాని పోకడ అర్థం చేసుకోడానికీ ఆ వినికిడి ఉపయోగించింది.

పోకడ అర్థమయ్యిందిగాని నివారణోపాయమే అర్థంకాలేదు. అట్టే ఆలోచిస్తే ఇది తప్పనిసరే కాదు అవసరమేమో కూడా!

అధికారానికీ, అదిచ్చే సౌకర్యాలకీ అలవాటుపడ్డ ముందుతరం తనకు తానుగా వాటిని వదులుకోలేదు.

ఆ తరంలో లుప్తమైపోతున్న ఉత్సాహం, సామర్థ్యం, తమలో ఉరకలు వేసి ఉరికిస్తూ ఉంటే, కళ్లేలు చేతిలోకి తీసుకోడానికి కొత్తతరం ఉద్రేకపడక తప్పదు.

ఆవిధంగా ప్రగతి కోసం ఘర్షణ అవసరం, అనివార్యం. కొత్తతరం అధవా సాధించలేనిదాన్ని ముదిమీ, మృత్యువూ దానికోసం సాధించి పెట్టడం యీ సత్యాన్నే చూపుతుంది.

సుదర్శనానికి తెలిసిన యీ విషయాలకు ఎంత వరకూ చెపితే, ఏ మాటల్లో చెపితే తల్లికీ, భార్యకీ అర్థ మవుతాయో ఆమేరకు, ఆ విధంగా చెప్పి అతనన్నాడు.

''రాబోయే తుఫానుకి సూచనల్లా రానున్న ఘర్షణకి నాందీ ప్రస్తావనలు మా యింట్లోనూ వినిపిస్తు న్నాయమ్మా! కొన్నాళ్లయి మా పిల్లలు తీరొకలాగా, మా తీరొకలాగా ఉంటోంది,'' అని-

''చెప్పొచ్చా?'' అన్నాడు శకుంతలతో.

''చెప్పండి చెప్పండి. ఆవిడేమన్నా పరాయి వారా?'' అంది శకుంతల.

''మీ కోడలు బస్తీ నుంచొచ్చింది. సంసారం జీవితం పట్నంలో ఆరంభమయ్యింది. మా కోడలు సిటీలో పుట్టింది. సిటీలో పెరిగింది. మా యింటికొచ్చే సరికి మేమున్న పట్నం కూడా సిటీ అవుతోంది. మీ కోడలు బస్తీ, పట్నం, సిటీ చూసినా ఆమె పునాదులు పల్లెటూరివి. ఆమె అమ్మా, అత్తా యిద్దరూ పల్లెటూరి వాళ్లే. మరి మా కోడలుందంటే- ఆమే కాదు, ఆమె తల్లే కాదు, సన్నిహిత బంధువులందరూ నగరవాసులు- మహానగరవాసులు.

''పిల్ల మంచిదే. అలా అని మీ కోడలూ అంగీకరి స్తుంది. జీవితం గురించి ఆమె అభిప్రాయాలతోనే యీమెకు పేచీ. ఇద్దరి పునాదులూ ఎక్కడా కలియవు మరి.

''ఆ పిల్లకు మేమంతా ఆమె తక్కిన బంధువు లందర్లాగా దర్జాగా, హోదాగా బతకాలి. ఎక్కళ్లేని డబ్బూ, ఫర్నిచరు మీదా, అలంకరణ సామగ్రి మీదా- ముఖ్యం గా చీరల మీదా తగలేస్తుంది. మా డబ్బు కాదనుకో- దాని పుట్టింటారిచ్చిందే; లేదా దాని మొగుడిచ్చేదీ.

''మావాడు జీతం తెచ్చి తల్లికిచ్చేస్తాడు. పై సంపాదన వాళ్లుంచుకుంటారు.

'డబ్బెవరిదైతే యేం. బ్యాంక్‌లో వేసుకోకూడదా! నగో నట్రో చేయించుకోకూడదా! అంటుందీమె. వాళ్లు ఎదురు జవాబు చెప్పరు. చెప్పిన సలహా పాటిం చరు- అంతే!

''వాళ్లలా చేయడం మరీ పుండుమీద కారం రాసినట్టుంటుంది ఈవిడికి. నన్ను చెప్పమని శత పోరింది. పై సంపాదన నన్నూ భయపెడుతోంది. దానా దీనా ఓ మాటన్నాను. 'ఇప్పుడంతా అలాగే ఉంటున్నారు మామయ్యా!' అంది.

''మావాడి పై సంపాదన మా ఆవిణ్ణి భయ పెట్టదు. కోడలి ఖర్చులు తగ్గించి కొడుకు సంపాదన కూడేసి వాళ్లని ఓ యింటివాళ్లను చేయాలన్నది యీావిడ అభిలాష.

''మిమ్మల్ని యిబ్బంది పెట్టడంలేదు కదా! అద నంగా వచ్చేదే అనుభవిస్తున్నాం. అదైనా మేమొక్కరిమే కాదు. ఇల్లా? ఇంకో రెండేళ్లుపోతే ఏ ఫ్లాటో కొనుక్కో డానికి ఆఫీసువాళ్లే అప్పిస్తారు- అన్నది వాళ్ల వాదన. ఇంట్లో డబ్బున్నా, బ్యాంక్‌లో డబ్బున్నా తల నొప్పు లున్నాయి. బంగారంగా మారిస్తే దొంగ భయమే కాదు, ప్రాణభయం కూడా ఉంది- అన్నది మరో వాదన.

''మా తక్కిన యిద్దరు పిల్లలు కూడా వాళ్ల పక్షమే. వాళ్లు చెడ్డమేకాదు వీళ్లనూ చెరుపుతున్నారన్నది యీమె బాధ.''

సుదర్శనాన్ని అంతవరకూ చెప్పనిచ్చి అందు కుంది శకుంతల.

''అదత్తయ్యా! అలాంటి పిల్లల చేతిలో సంసారం అప్పగించి ఎక్కడికో పారిపోదామంటారీయన. మీరైతే అలా చెయ్యగలరా? చెప్పండీ,'' అంది శకుంతల.

శకుంతల ఉన్న పరిస్థితి కొంత వేరు. ఆ పరిస్థితి లో సుభద్రమ్మ ఎప్పుడూ లేదు. అత్తాకోడళ్లకి నప్పక పోవడమే పరిస్థితి అయితే ఆ అనుభవం ఆమెకీ ఉంది.

అత్త ఉండగా కోడలూ, తండ్రి ఉండగా కొడుకూ యింటి యజమానుల్లా వ్యవహరించడం సుభద్రమ్మకి సరిపడని విషయం. అప్పుడు తనూ సుదర్శనంలాగే ఆలోచించింది. ఇంటి మర్యాదా, రామభద్రయ్య ఓటి తనం అడ్డొచ్చాయి. లేకపోతే లోకం పాటిగా కోడల్నైనా వేరుపెట్టేది. తనైనా వేరుండేది.

సుభద్రమ్మ ఎటూ చెప్పదని సుదర్శనానికి తెలుసు.

''అమ్మేమీ చెప్పదుగాని నేచెపుతా విను. అలాంటివాళ్లు- అనడంలో నీ ఉద్దేశ్యం బాధ్యత తెలి యని వాళ్లు అనికదా! అందుకే వాళ్లకి యిల్లప్ప గించడం,'' అంటూ తల్లితో -

''దీనికి తెలియడం లేదమ్మా! అన్నీ అమిరిన వాళ్లకి అనుభవించాలనే ఉంటుంది. కాని బరువులు మొయ్యాలని ఉండదు. ఏదో ఎదురుదెబ్బ తగిలి తలకు మించిన భారం నెత్తిన పడాలి, లేదా అనుభవా నికి ఆటంకాలేర్పడాలి. అప్పుడుగాని వాళ్లకి బాధ్యత గుర్తురాదు.

''రెండేళ్లలో నేను రిటైరవుతాను. అప్పుడు పరి స్థితులు చాలా మారుతాయి. నా నెలసరి ఆదాయం సగానికి సగం పడిపోతుంది మనవడూ, మనవరాలూ చదువుల కెదుగుతారు. పసిపిల్లల చదువులకి కూడా ఏటా వేలు కావలసి వస్తాయి. కొత్త పరిచయాలూ, కొత్త స్నేహాలూ, కొత్త అవగాహనలకీ, కొత్త ఊహలకీ చోటి స్తాయి. కొత్త పరిస్థితుల్లో దాదాపు అందరి ఆలోచన

ల్లోనూ పెద్ద పెద్ద మార్పులొస్తాయి. అప్పుడు మా కోడలు- ఇప్పట్లానే, మిమ్మల్ని ఇబ్బందిపెట్టడం లేదన్నా మీ సొమ్ము మేం తినడం లేదు- అన్నట్టు అనిపిస్తుంది,'' అన్నాడు సుదర్శనం.

ఎందుకో శకుంతలకి మాచెడ్డ కోపం వచ్చింది.

''మీరన్నీ ఊహించుకుంటారు,'' అంది పరమ నిష్ఠూరంగా.

'కాదమ్మా! వాడన్నదాంట్లో నిజం ఉంది,'' అనబోయింది సుభద్రమ్మ.

ఈలోగానే సుదర్శనం-

''పిల్లలు బాధ్యత వహించడంలేదు, వహించడం లేదు అనుకుంటాంగాని వాళ్లు నిజంగా వహిస్తే పెద్ద వాళ్లు సహించలేరు శకుంతలా! వాళ్ల యింటి పెత్తనం కావాలనుకోకముందే దాన్ని వాళ్లకప్పగించడం మంచిది. అది మన సంప్రదాయం కూడా. కొడుకులికి సంపాదనా, కోడళ్లకి యిల్లు దిద్దడం నేర్పేదాకే గృహస్థాశ్రమం. ఆ తర్వాత వానప్రస్థానికి వెళ్లమన్నారు మన పెద్దలు. నాకా పద్ధతి చాలా నచ్చింది,'' అంటూ ఆగిపోయాడు సుదర్శనం.

ఆరాత్రి కొడుకూ కోడలూ పడుకున్నాక కూడా ఎంతవరకో సుభద్రమ్మకి నిద్రపట్టలేదు.

సుదర్శనం ఏం చెప్పదలచి ఏం చెప్పేడో సొంతం అర్థంకాకపోయినా, అర్థమైన కాడికి ఆమెను ఆలోచనలో పడేసింది. ఆలోచనలెప్పుడూ మరీ కొత్తదారులు తొక్కలేవు.

*

మర్నాడు అస్థి నిమజ్జనం.

శకుంతలా, సుదర్శనం కాఫీలు దాకా ఫరవాలేదంటే వాటికోసం బయటికి వెళ్లేరు. సుభద్రమ్మ కాఫీ కూడా తీసుకోనంటూ గదిలోనే ఉండిపోయింది. ఆమెకి రాత్రి నిద్ర తక్కువవడంవల్ల శరీరం, ఆలోచన ఎప్పటికీ తెగకపోవడంవల్ల ఆమె మనసూ బరువుగా ఉన్నాయి.

సుదర్శనం చెప్పినదాంట్లో చాలావరకూ నిజముంది అనిపించింది సుభద్రమ్మకి. తనూ చాలా కుటుంబాలు చూసింది. కొన్ని చుట్టాలవి. కొన్ని ఊళ్లోవి. ఎదిగిన సంతానాలూ, వయసు ముదిరిన తల్లిదండ్రులూ ఉన్న ప్రతి కుటుంబంలోనూ ఘర్షణలుంటాయి. అవి రకరకాలు.

నిత్యం రవరవల్తో సతమతమయ్యేవి కొన్నైతే, జుట్లూ జుట్లూ పట్టుకొని కర్రల్దాకా, కత్తుల్దాకా పోయేవి కొన్ని. ఇరుగు పొరుగుల ముందో, ఐనవాళ్ల ముందో కళ్లొత్తుకోడంతో కొందరు సరిపెట్టుకుంటే, వీధినపడి పెద్దల్చేత తీర్పులు చెప్పించుకునేవి మరికొన్ని.

సుదర్శనం అన్నట్టు పెంపకాలూ, నటనలూ, మాటలూ యివన్నీ తీసి పక్కన పెట్టేస్తే మనుషులు ఎవరికి వారేనేమో. తల్లీ తండ్రీ, అన్నా తమ్ముడూ, తోడబుట్టిన అక్కచెల్లెళ్లూ, ఏకోదరుల్లా మసిలిన స్నేహితులూ, స్నేహితురాళ్లూ- వీళ్లందరి మధ్యా ఆపేక్షలూ, అభిమానాలూ అనేవి నిజమా? నిజమే అయినా అవి అందరూ అనుకునేటంత గట్టివేనా? కాదనుకోడానికి ఆమె మనసు ఒప్పడంలేదు. కానీ కడుపున ఉన్న బిడ్డలూ, కట్టుకున్న భార్యాభర్తల మధ్య ఆపేక్షలే పరీక్షలకు నిలిచీ నిలవనట్టు కనిపిస్తున్నాయి. అందుకు తన హృదయమే సాక్షి. గత సంవత్సరకాలంలో తన జీవితానుభవమే నిదర్శనం.

ఆరోజు రామభద్రయ్య పోయేడు. భర్త ఆఖరి శ్వాస పీల్చుకున్నప్పుడు ఆమె అతని పక్కన లేదు.

ముందురోజు రాత్రంతా ఆయాసంతో తెగ బాధపడిన రామభద్రయ్య ఆ ఉదయం ఝాము పొద్దెక్కేసరికి- అది మగతో నిద్రో తెలియదు- నిద్రపోతున్నాడనిపించింది. పెద్ద కొడుకు ఆయన దగ్గరుంటానంటే తను నూతి కెళ్లింది. నిద్రాహారాలు చాలక అలసి సొలసిన దేహం మీద రెండు బాల్చీల నీళ్లు పోసుకుందో లేదో, 'మామ్మా నువ్వు వేగం రా,' అంటూ తలుపవతల నుండి కేకేసింది మనవరాలు. ఆ గొంతు వింటే రెండు విధాల అనిపించింది. ఆయనకు మళ్లా ఆయాసమొచ్చింది కాబోలు, లేక అవసానమా? చేదుతున్న బాల్చీ నెత్తిమీద ఒంపుకొని తడిచీర విడిచి పొడిచీర చుట్టుకుంది. ఆమె వీధిలోకి వెళ్లేసరికి అతని కట్టె వాకిట్లో దించుతున్నారు.

అది చూడగానే తనకేమవాలి? ఏమీ అవలేదు. సరికదా- మనసేదో తేలికపడ్డట్టు ఊపిరి. ఆ తర్వాత సంగతి సరే! ఆ క్షణాన మాత్రం అలానే అనిపించింది.

అదే మనిషికి అతని నడివయస్సులో ఓసారి ప్రాణంమీదికొచ్చింది. అప్పుడు తనెంత విలవిల్లాడిందీ? అతనికేమేనా అయితే నిశ్చయంగా నుయ్యో గొయ్యో చూసుకోవాలనుకుంది. ఒకానొక స్థితిలో ఆమాట అతనితో అంది కూడా.

అవసాన దశలో అందుకు విభిన్నంగా అనిపించినందుకు ఆ తర్వాత తనెంత బాధపడ్డా, అందుకు కారణాలు తానెన్ని వెతుక్కున్నా, ఆ ఘట్టం జ్ఞాపకం వస్తే ఏదో సిగ్గూ, అపరాధభావం తన మనసులో మెదుల్తాయి. పదవనాటి ఏకాంతంలో అది తలపున పడ్డప్పుడు నడి వయసునాటి రామభద్రయ్య తన ఎదుట పడి నవ్వుతున్నట్టు కనిపించింది. ఎన్ని కన్నీళ్లు కార్చినా, ఎంత పశ్చాత్తాపపడ్డా ఆ జ్ఞాపకాలు చెరగడం లేదు. కాశీ ప్రయాణం నిశ్చయమైన రాత్రి, కాశీకి బయల్దేరుతుంటే, నిన్న రాత్రి ఏకాంతంలో, యీ ఉదయం, ఇప్పుడు కూడా రామభద్రయ్య నవ్వుతూ తన ముందున్నాడు.

అలా ఆ మనిషి కనిపించినప్పుడల్లా ఆమె గుండె దిగులుతో బరువెక్కుతుంది. అప్పటికే దిగులుగా వుంటే అది మరింత పెరుగుతుంది.

ఆ ఉదయం లేచిన దగ్గర్నుండీ ఆమెలో దిగులు ప్రవేశించి క్రమక్రమంగా పేరుకుంటోంది. రాత్రి ఎంత ఆలోచించినా తనో స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోయింది.

తన ముందు మూడు దారులున్నాయి.

పెద్ద కొడుకు కోరినట్టు అతనితో అతనింటికి వెళ్లడమా? కొత్తచోటు. కొత్త పద్ధతులు. ఆ కొడుకును ఎరిగినంతగా తను ఆ కోడల్నే ఎరగదు. పైగా మనవలూ, మనవరాళ్లూ, ముని మనవలు, ఇంతవరకూ ఆ కుటుంబంలోకి మన్నన చుట్టంగా వెళ్లొస్తున్నా అందులో భాగంగా ఎప్పుడూ లేదు. ఇపుడు, ఆ యింట్లో అత్తా కోడళ్ల మాట ఒకటి కాదని వింటోంది. ఆ మధ్య తను గడపడం అదేం గొడవో?!

ఊళ్లో కొడుకు విషయానికొస్తే - ఆదినుండీ తనా కుటుంబంలో భాగం. ఆ యింట్లో తన స్థితి మరింత దిగజారొచ్చు. లేదా ఎప్పట్లానే ఉండొచ్చు. కాని ఆ కుటుంబంలోనూ ఆ ఊళ్లోనూ తనో భాగం.

ఎటూ తేల్చుకోలేకపోయింది గత రాత్రి. అన్నిటికీ పరిష్కారంగా మూడో దారుంది. కాని, అది గౌరవంగా బతుకుతున్న పిల్లల్ని ఏ చిక్కుల్లో పడేస్తుందో అన్న భయం.

ఆ ఉదయం కూడా ఆమె ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. వ్యవధి చూడబోతే నిమిష నిమషానికీ తగ్గిపోతోంది. చివరికి శకుంతలా, సుదర్శనం తిరిగి రావడం చూసి మనసులో అనుకుంది.

'సర్వేశ్వరా! ఇంక నీదే భారం. నేను మరి ఆలోచించలేను. నీ సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. ఆ క్షణానికి నువ్వేం తోపిస్తే అదే చేస్తాను. పాప పుణ్యాలూ, పిల్లల మంచి చెడ్డలూ నీవే,' అంటూ ఆలోచించడం మానేసింది.

*

ఉదయం తొమ్మిదిగంటల వేళ శాస్త్రిగారి మనిషొచ్చేడు. అంతకుముందే శకుంతల అన్నీ సర్ది ఉంచడంతో ఆ వెంటనే బయల్దేరేరు.

ఆశ్రమం బయట కొట్టు గదిలో అస్థికల పాత్ర ఉంచేరు. దానిని తీసుకొని సుదర్శనం, అతనికి దారి చూపుతూ ముందుగా ఆ మనిషీ మెట్లు దిగేరు. వాళ్ల వెనక శకుంతల. ఆ వెనక సుభద్రమ్మ. శకుంతల చేతి సంచిలో మారుగుడ్డలూ, పసుపు కుంకుమలున్నాయి.

ముందున్న మొగాళ్లు సందు మలుపు తిరిగేక కనిపించలేదు. మరో మలుపులో వాళ్లు కనిపించేసరికి ఎదురుగా విశాలమైన గంగ. గంగ చిక్కి సగమైనా విశాలంగా ఉంది. నిండు గంగ ఇంకెంతలా ఉంటుందో!

గంగ కనిపించగానే, ఆ గంగ గురించి ఊహించగానే సుభద్రమ్మ శరీరంలో తొలిసారిగా ఓ అవ్యక్తమైన సంచలనం. అద్భుతమైన కాశీ మహాక్షేత్రంలో మసలుతున్న అనుభూతి అప్పుడే.

తీరమంతటా చెదురు మదురుగా యాత్రికులు. కొందరు పడవల్లో. కొందరు స్నానఘట్టాల్లో. మరి కొందరు గట్లమీద.

స్నానఘట్టాలనానుకొని రెండు పక్కలా ఎత్తైన గట్లనానుకొని చదును ప్రదేశాలు. ఎడమవైపు చదును అంచున ఏటిగట్టుమీద ఎవరో నడివయసువాడు. అచ్చం రామభద్రయ్యలాగే కనిపించేడు. సుభద్రమ్మ గుండె క్షణకాలం లయతప్పింది.

శకుంతల- 'ఇటు ఇటు-' అంటూ ఆమెను కుడిచేతి వైపు చదును ప్రదేశానికి మళ్లించింది. అక్కడ తమబోటివారు మరో ఆరుగురున్నారు. అక్కడ మఠం వేసుక్కూర్చున్న పురోహితుడు అందర్నీ స్నానాలు చేసి రమ్మన్నారు. శకుంతల చేతిసంచి అక్కడ ఉంచి పసుపూ కుంకుమ పొట్లాలు తీస్తూ ఉంటే సుభద్రమ్మ అవతలివైపు చదును ప్రదేశం కేసి చూసింది. ఆ మనిషి అక్కడ లేడు. అటుపక్క అంతా వెతికినా కనిపించలేదు.

"పదండి!" అంది శకుంతల.

ఆసరికే సుదర్శనం మెట్లు దిగుతున్నాడు. వాళ్లు కదుల్తుంటే తమ ముందు రామభద్రయ్య ఆకృతి దారి తీస్తున్నట్టుంది. అది భ్రమే అని తెలిసినా సుభద్రమ్మ గుండెలు దడదడలాడేయి. ఎదురుగా కొడుకు తడిబట్టల్తో పది రోజులవడంవల్ల నల్లబడుతున్న తలా గడ్డాలతో, చేత చెంబూ నీళ్లతో, మెట్లెక్కుతున్నాడు. ఆ ఆకారం నీళ్లలో నిలబడి తమవంక చూస్తున్నట్టు ఊహ.

శకుంతల 'పదండి పదండి' అంటూ వెన్నుమీద చేయేసి నడిపిస్తోంది. నీళ్లను సమీపించేసరికి రేవు గలీజుగా ఉంది. కొబ్బరినీళ్లల్లా ఉంటాయనుకున్న గంగాజలాలు సుద్ద మట్టిరంగులో సుళ్లు తిరుగుతున్నాయి. కెర్లుతున్నాయి. చిత్రం! శకుంతల తన్ను ఆయన ఆకృతి నీటిలో నడిపించిన చోటికే నడిపిస్తోంది.

చుట్టూ చిన్న చిన్న గుంపులుగా యాత్రికులు. ఆమధ్య ప్రదేశమే కొంత ఖాళీ. నీటిలో తనకు ఎడమవైపు శకుంతల నించుంది. కుడివైపు రామభద్రయ్య ఆకృతి ఉన్నట్టు భ్రమ.

రామభద్రయ్యతో చెంగులు ముడేసుకు చేయ వలసిన గంగాస్నానం. అది ఊహల్లో కల్పించుకున్నదో ప్రేతాత్మో- ఆ ఆకృతిలో చేస్తోంది. సుభద్రమ్మకి శరీరం సన్నగా వణుకుతున్నట్టనిపించింది. స్నానం చేసి లేచాక ఆ ఆకృతి జాడలేదు.

శకుంతల రెక్కపట్టుకు నడిపిస్తుంటే సుభద్రమ్మ గట్టెక్కింది.

తడి బట్టలతో వచ్చిన వాళ్లందరూ, కర్తల పక్కగా, కుటుంబాల వారీగా కూర్చున్నారు. ముందుగా, గంగా స్నాన యోగ్యత కోసం ప్రాయశ్చిత్తకాండ సాగిస్తున్నాడు పురోహితుడు.

మంత్రాలు వినిపిస్తుంటే తనూ, రామభద్రయ్య ఆకృతీ పక్కపక్కనే ఉన్నట్టు ఊహించబోయింది. ఏవేవో బాలసారె దృశ్యాలు అనుతున్నాయి. తను కోరుకున్న దృశ్యం అనడం లేదు.

"పదండి," అంటూ శకుంతల రెక్కపట్టుకు లేవ నెత్తుతుంటే ఆవిడ మళ్లా యీలోకంలోకి వచ్చింది.

అత్తా కోడలూ పావంచాలు దిగి తక్కిన యాత్రికుల మధ్య నీళ్లలో నిల్చున్నారు. శకుంతల దృష్టి పడవలో గంగమీది కెళ్తున్న సుదర్శనం మీదుంది. సుభద్రమ్మ మూసిన కన్నుల్తో, జోడించిన చేతుల్తో ప్రశాంతమైన ముఖంతో ఏ ప్రార్థనల్లో ఉందో, ఏ తలపు ల్లోనే ఉందో ఆమెకే తెలియాలి.

"అదిగో! అదిగో!!" అంటూ శకుంతల అత్తగార్ని కుదిపింది.

సుదర్శనం పళ్లూ, పువ్వులూ పిండాలతో అస్థికలూ, పాత్రా గంగలోకి విడుస్తున్నాడు.

"ఇక మునగండి! మునగండి!!" అంటూ అత్తగారిని హెచ్చరించి శకుంతల మునకలేస్తోంది.

మూడుసార్లు మునిగి లేచిన శకుంతల పక్కకి చూస్తే అత్తగారింకా మునకలేస్తోంది. జుత్తు పిండు కుంటూ శకుంతల అత్తగారివంకే చూస్తోంది. కడసారి లేచి సూర్యభగవానుని వంక చూసి సుభద్రమ్మ మరో మునక వేసింది. అది పెద్దగా అలలు రేపింది.

శకుంతలకేదో అనుమానమయ్యింది. అటుకేసే చూస్తూ ఉంటే మునిగిన అత్తగారు ఎంతకూ లేవదు. గాభరాగా, అలలు లేచిన చోటికి ఇటూ, అటూ, ఎదరా చూసింది. ఎదుట, కాస్త ముందికి, గాలి బుడగలు. ఆ తరవాత మరింత ముందుకి అత్తగారి చీర బుడగ. శకుంతల హడిలిపోతూ "అయ్యో!" అని కేకేసింది. అప్పటికీ ఆవిడ జాడలేదు.

"అత్తయ్యా! అత్తయ్యా!! మా అత్తయ్య మునిగి పోతోంది," అంటూ వెనక ముందులాడకుండా నీట్లోకి దిగిపోతోంది.

నీళ్లు పీకల్దాకా రాగా భయమేసి, "అత్తయ్యా!" అంటూ ఆర్తనాదం చేస్తోంది.

ఎవరో పొడుగాటి మనిషి ఇంకో అడుగు ముందు కేయబోతూ వుంటే జబ్బ పట్టుకు వెనక్కి లాగేసేడు. ఆమెకు నేల అందక గాభరా పడుతోంది. మరో యిద్దరు జోరుగా బారలేస్తూ ఏట్లోకి యీదుతున్నారు. ఆ తరవాత శకుంతలకంతా గందరగోళం.

శకుంతలను లాక్కుంటూ వెళ్లిన మనిషి ఆమెను నీటి ఒడ్డున మెట్లమీద పడేసేడు. ఈదుకుంటూ వెళ్లిన వాళ్లు సుభ్రదమ్మను మోసుకొస్తున్నారు.

శకుంతల కాస్త తేరుకొని లొటలొటలాడే కాళ్లతో ఒడ్డెక్కేసరికి సుభద్రమ్మ చుట్టూ జనం మూగి ఉన్నారు. వాళ్ల మధ్య నుండీ చోటు చేసుకొని అత్తగారి దగ్గరికెళ్లే సరికి తెలివితప్పినట్లున్న సుభద్రమ్మ.

శకుంతల ఏడుపారంభిస్తుంటే ఎవరో తెలు గాయన-

"మరేం ఫరవాలేదమ్మా! ఎక్కువ నీళ్లు తాగలేదు. ఆమె బతుకుతుంది." అన్నాడు నమ్మకంగా.

*

ఆ సాయంత్రం పడుకుని లేచాక తల్లీ, తనే గదిలో ఉండగా-

"ఇంతకూ ఏమయ్యిందమ్మా?" అడిగాడు సుదర్శనం.

నదీ ప్రవాహాల్లో సుడిగుండాలేర్పడేచోట ఆ అడుగున గోతులేర్పడుతాయట. అలాంటి గోతిలో ఆమె కాలు జారుంటుందని అందరూ అనుకున్నారు. అది రూఢి చేసుకునేందుకు సుదర్శనం ఆత్రుత పడు తున్నాడు.

అతడు రెండో ప్రశ్న వేస్తుంటే శకుంతల అక్కడి కొచ్చేసింది.

"ఎందుకలా పదే పదే ఆవిణ్ణలా రొక్కిస్తారూ? ఏదో అయ్యింది. ఆవిడ దక్కిందికదా? ఇంక ఆ విషయం మరిచిపొండి," అంటూ భర్తని మందలిం చింది.

అప్పుడు కూడా సుభద్రమ్మ జవాబివ్వలేదు. సుదర్శనం మరో ప్రశ్న వెయ్యలేదు.

*రచన మాసపత్రిక, అక్టోబరు 1992*